జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

## నల్లగొండ

సూర్యాపేట - యాదాద్రి భువనగిరి

శుక్రవారం 6 మార్చి 2026 పేజీలు : 14





2 లో..



సంపూర్ణ ఆరోగ్యం కోసం కోకోనట్ జ్యూస్.. బత్తుల సూరిబాబు

# 99 రోజుల కార్యాచరణ ప్రణాళికను విజయవంతంగా అమలు చేయాలి



నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి. శరత్ చంద్ర

నల్గొండ మార్చి 5 (ప్రజా జ్యోతి)



ప్రజా పాలన, ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక నేపథ్యంలో, నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ లో రిసోర్స్ పర్సన్స్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ మాట్లాడుతూ..99 రోజుల కార్యాచరణ ప్రణాళికను విజయవంతంగా అమలు చేయడానికి అవసరమైన సూచనలు ఇచ్చారు. అలాగే అందరు రిసోర్స్ పర్సన్స్ శుక్రవారం క్లాక్ టవర్ వద్ద సమావేశమై 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక కు సంబంధించిన ప్రతిజ్ఞ పఠనం చేయవలసిందిగా ఆయన సూచించారు

## ఉమ్మడి జిల్లా సన్నాహక

# సమావేశం ఈ నెల 7 కు వాయిదా

**జిల్లాలోని అధికారులు, సిబ్బంది అందరూ సమిష్టిగా పనిచేసి ప్రజా పాలన- ప్రగతి ప్రణాళికను విజయవంతం చేయాలి జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్.**



2 లో..



# విద్యార్థుల పఠన నైపుణ్యాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్

వార్త 2లో


## కోదాడ మండలంలో

# ఏరులై పారుతున్న మద్యం..

7 లో..



కోదాడ నియోజకవర్గంలో శాంతిభద్రతల పరిరక్షణకు, యువత భవిష్యత్తును కాపాడటానికి ఎమ్మెల్యే నలమాద ఉత్తం పద్మావతి రెడ్డి  అక్రమ మద్యం, గంజాయిపై యుద్ధం ప్రకటించినప్పటికీ, క్షేత్రస్థాయిలో ఎక్సైజ్ శాఖ వైఖరి మాత్రం అందుకు భిన్నంగా ఉంది. ఎమ్మెల్యే నియోజకవర్గ అభివృద్ధి సమీక్షల్లో మరియు బహిరంగ సభల్లో డ్రగ్స్‌కు నో చెప్పండి అనే నినాదం తో ప్రసంగాలు చేస్తున్నప్పటికీ,గంజాయిని, అక్రమ బెల్టు షాపులను పూర్తిగా అరికట్టాలని అధికారులను కఠినంగా ఆదేశిస్తున్న. అయినప్పటికీ, కోదాడ ఎక్సైజ్ విభాగం మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



# సంపూర్ణ ఆరోగ్యం కోసం కోకోనట్ జ్యూస్..

## బత్తుల సూరిబాబు




**నల్గొండ టౌన్ మార్చి 5 (ప్రజా జ్యోతి)**

సర్వరోగ నివారణ, సంపూర్ణ ఆరోగ్యం కోసం కోకోనట్ జ్యూస్ ని సేవించి ఆరోగ్యంగా జీవించాలని షాపు నిర్వాహకులు బత్తుల సూరిబాబు సూచించారు. గురువారం పట్టణంలోని ఆర్ పి రోడ్ తాలూఖ్ దారి మసీదు వద్ద నూతనంగా ఏర్పాటుచేసిన శ్రీ సత్యదేవ కోకోనట్ ట్రేడర్స్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు సూరిబాబు మాట్లాడుతూ కోకోనట్ జ్యూస్ ను సేవించడం ద్వారా చెడు కొలెస్ట్రాల్ ను తగ్గించడంతోపాటు రోగ నిరోధక శక్తిని పెంచుతుందని అదేవిధంగా జీర్ణశక్తిని మెరుగుపరుస్తుంది అన్నారు. నీరసంగా ఉన్నవారు ఈ కొబ్బరి జ్యూస్ ను తీసుకోవడం ద్వారా శక్తిని పెంచుతుందని ప్రతి ఒక్కరు ఈ జ్యూస్ ను సేవించి ఆరోగ్యంగా జీవించాలని ఆయన సూచించారు. ఒక్క ఫోన్ చేస్తే నిమిషాలలో డోర్ డెలివరీ కూడా చేయబడును అని ఈ అవకాశాన్ని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో టి రాజు వినయ్ సత్తిబాబు శ్రీను జి కే మూర్తి సతీష్ నరసింహ తదితరులు ఉన్నారు..

# విద్యార్థుల పఠన నైపుణ్యాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్

**మునగాల, మార్చి 5 (ప్రజా జ్యోతి):**

సూర్యాపేట జిల్లా మునగాల మండలం ఆకుపాముల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మరియు అంగన్వాడి కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా 7, 8, 9 మరియు 10వ తరగతుల విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులు పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు పాఠ్యాంశాలను సులభంగా అర్థం చేసుకునే విధంగా ఉపాధ్యాయులు సృజనాత్మకంగా బోధించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ముందుగా ఉన్నత పాఠశాలను సందర్శించిన కలెక్టర్, విద్యార్థుల హాజరు వివరాలు తెలుసుకొని, ముఖ గుర్తింపు విధానంలో హాజరు నమోదు ప్రక్రియను స్వయంగా పరిశీలించారు. అనంతరం ఆరు, ఏడు, ఎనిమిది, తొమ్మిది మరియు పదో తరగతి గదులను సందర్శించి విద్యార్థులతో నేరుగా మాట్లాడి బోధన విధానంపై అభిప్రాయాలు తెలుసుకున్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అన్ని తరగతులను పరిశీలించిన కలెక్టర్, ఏడు, ఎనిమిది, తొమ్మిది మరియు పదో తరగతి విద్యార్థులతో వివిధ సబ్జెక్టులపై మాట్లాడించి వారి పఠన నైపుణ్యాలను పరీక్షించారు. పాఠశాల ప్రాంగణ పరిశుభ్రత, తాగునీటి సదుపాయాలను కూడా పరిశీలించారు. పాఠశాలలో కుర్చీలు, బెంచీలు అవసరమైతే ప్రతిపాదనలు సమర్పించాలని ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు అన్ని సబ్జెక్టుల్లో పట్టు సాధించేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. పదాల సరైన ఉచ్చారణ, అర్థ వివరణతో పాటు ఆంగ్ల పదాలను తెలుగులో సరిగ్గా అనువదించి బోధించాలని తెలిపారు. విద్యార్థులు చదివినది అర్థం చేసుకోవడం అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

# ఉమ్మడి జిల్లా సన్నాహక సమావేశం ఈ నెల 7 కు వాయిదా

## జిల్లాలోని అధికారులు, సిబ్బంది అందరూ సమిష్టిగా పనిచేసి ప్రజా పాలన- ప్రగతి ప్రణాళికను విజయవంతం చేయాలి

## జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్.

**నల్గొండ మార్చి 05 (ప్రజా జ్యోతి ప్రతినిధి):**

పరిపాలన పరమైన కారణాల వల్ల ఈనెల 6న నిర్వహించదలచిన ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక ఉమ్మడి నల్గొండ జిల్లా సన్నాహక సమావేశాన్ని 7 న ఉదయం 10 గంటలకు ఉదయాదిత్య భవన్లో నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ తెలిపారు. ప్రజా పాలన -ప్రగతి ప్రణాళిక పై గురువారం అయన జిల్లా కలెక్టర్ కార్యాలయం నుండి ఆర్డీవోలు, తహసిల్దారులు, ఎంపీడీవోలు, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మార్చి 6 నుండి జూన్ 12 వరకు 99 రోజులపాటు నిర్వహించే ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ప్రధాన అంశాల వారిగా కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. మొదటి ప్రధాన అంశమైన "పరిసరాల పరిశుభ్రత, ఫైళ్ళ పరిష్కరణ" కార్యక్రమాన్ని ఈనెల 6 నుండి మార్చి 15 వరకు జిల్లా స్థాయి మొదలుకొని, గ్రామస్థాయి వరకు నిర్వహించాలని, ఇందులో భాగంగా అన్ని కార్యాలయాలలో, ప్రభుత్వ సంస్థలలో పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టాలని, ఆయా విభాగాల వారిగా పెండింగ్ లో ఉన్న ఫైళ్ల జాబితా రూపొందించి మార్చి 15 నాటికి అన్ని ఫైల్స్ పరిష్కరించాలని ఆదేశించారు. రెండవ అంశమైన "ఆరోగ్యం" లో భాగంగా ఏప్రిల్ 6 నుండి 11 వరకు నిర్వహించే ఆరోగ్య కార్యక్రమాలలో భాగంగా మహిళా శిశు ఆరోగ్యం, టీకాల ప్రాముఖ్యత, గర్భిణీ స్త్రీలకు వైద్య సేవలు, ఆరోగ్య శిశువుల పోటీలు,వెక్టర్ ద్వారా వ్యాపించే వ్యాధుల నియంత్రణ, నవజాత శిశు సంరక్షణ, బరువు తక్కువగా ఉన్న పిల్లల గుర్తింపు వంటి కార్యక్రమాలపై చర్చించాలని, అలాగే కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. "సురక్షితంగా చేరండి " పేరున ఏప్రిల్ 13 నుండి 18 వరకు నిర్వహించనున్న రహదారి భద్రత కార్యక్రమంలో భాగంగా ప్రమాదాలు ఎక్కువగా జరిగేందుకు అవకాశం ఉన్న రహదారులను గుర్తించాలని, ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన అంశాలపై ప్రజలకు తెలియజేయడం, రహదారి భద్రతపై అవగాహన, రోడ్డు భద్రత నియమాల పై ప్రతిజ్ఞ వంటివి చేయించాలన్నారు. మరో ప్రధాన అంశమైన "సంక్షేమం"లో భాగంగా ఏప్రిల్ 20 నుండి 26 వరకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న చేయూత పింఛన్లు, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, మహాలక్ష్మి, ఎల్పిజి గ్యాస్ సబ్సిడీ, మహాలక్ష్మి ఉచిత బస్సుసౌకర్యం, గృహ జ్యోతి కింద లబ్ధిదారులకు అందించిన లబ్ధిని గ్రామాల వారిగా సమాచారాన్ని రూపొందించి. గ్రామ వార్డు సభలలో వినిపించాలని, అందరూ లబ్ధిదారులను గ్రామసభకు ఆహ్వానించి తెలియజేయాలని చెప్పారు. "చిన్నపిల్లల సంరక్షణ, నో డ్రగ్స్" కింద ఏప్రిల్ 27 నుండి మే 2 వరకు నిర్వహించే కార్యక్రమంలో భాగంగా యువత, డ్రగ్స్ బారిన పడకుండా అలాగే మహిళలు, పిల్లలపై దాడుల నివారణ, బాల్యవివాహాల నివారణ, తదితరాంశాలపై అవగాహన కల్పించాలని తెలిపారు. "వ్యవసాయం" లో భాగంగా మే 4 నుండి 10 వరకు సోలార్ పంపు సెట్ల నిర్వహణ, రైతు భరోసా, రైతు బీమా, పంటల మార్పిడి, తదితర అంశాలు, అలాగే వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు, సన్న బియ్యం బోనస్, నీటిపారుదల, ఆయిల్ పామ్ తోటల పెంపకం వంటి వాటి పై అవగాహన కల్పించాలని చెప్పారు. మే 11 నుండి 16 వరకు "విద్య, పాఠశాలల్లో మౌలిక వసతుల" కల్పన సందర్భంగా అన్ని పాఠశాలల్లో పరిశుభ్రత, ఈ-వస్ట్ మేనేజ్మెంట్ నిర్వహణ, బడి మానివేసిన పిల్లలను బడిలో నమోదు చేయించడం, అక్షరాస్యత కార్యక్రమాలు, అదేవిధంగా 10వ తరగతి పరీక్షల నిర్వహణ వంటి కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. "యువత, క్రీడల" అంశంలో భాగంగా మే 18 నుండి 23 వరకు తెలంగాణ క్రీడా ప్రాంగణాలను వినియోగంలోకి తీసుకురావడం, అన్ని పార్కులు, క్రీడా మైదానాలను శుభ్రం చేయటం, గ్రామస్థాయి మొదలుకొని జిల్లా స్థాయి వరకు 10 కే, 5 కె, 2 కె మారతాన్ల నిర్వహణ చేపట్టాలని ఆదేశించారు. "మహిళా సంక్షేమం"లో భాగంగా మే 25 నుండి 30 వరకు ఇందిరా మహిళా శక్తి పథకం కింద మహిళలకు అందిస్తున్న పథకాలు, కార్యక్రమాలు, స్వయం సహాయక సంఘాలకు రుణాల మంజూరు, మహిళల సమస్యలు, వారి సంక్షేమం, తీసుకోవాల్సిన అంశాలపై చర్చించాలని తెలిపారు. జూన్ 1 నుండి జూన్ 12 వరకు "పర్యావరణ కార్యక్రమాల" కింద సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగించకుండా అవగాహన కల్పించడంతో పాటు, వనమహోత్సవం కింద పెద్ద ఎత్తున మొక్కలు నాటే విషయంపై దృష్టి సారించాలని, అలాగే చెరువులు, కాలువలు కబ్జాకు గురైనట్లయితే వాటిని తొలగించడం చేయాలని తెలిపారు. ప్రజా పాలన -ప్రగతి ప్రణాళికలో భాగంగా ఏప్రిల్ 2న గ్రామ/ వార్డు /మున్సిపల్ వార్డు/ మున్సిపల్ కార్పొరేషన్ వార్డుల స్థాయిలో సమావేశం నిర్వహించడం జరుగుతుందని, అలాగే ఏప్రిల్ 16 న మండల స్థాయిలో, మే 2 న నియోజకవర్గస్థాయిలో, మే 22న జిల్లా స్థాయిలో, జూన్ 2న రాష్ట్రస్థాయిలో కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. గ్రామ సభకు గ్రామస్థాయిలోని అధికారులు, ప్రజాప్రతిని అందరిని ఆహ్వానించాలని ఆదేశించారు. జిల్లా స్థాయి అధికారులు మొదలుకొని, గ్రామస్థాయి వరకు అధికారులు అందరూ క్షేత్రస్థాయిలో ఉండాలని, ప్రతి కార్యక్రమానికి నివేదిక రూపొందించడమే కాకుండా, ఫోటోలు, వీడియోల రూపంలో డాక్యుమెంట్ రూపంలో భద్రపరచాలన్నారు. ఈనెల 12న జిల్లా స్థాయిలో ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక పై ఓరియంటేషన్ శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులను అధికారులందరూ ఆహ్వానించడం జరుగుతుందని చెప్పారు. ప్రజా పాలన- ప్రగతి ప్రణాళికలో భాగంగా అధికారులు క్షేత్రస్థాయిలో సందర్శించినప్పుడు పాఠశాలలు, హాస్టల్లను సందర్శించాలని ఎక్కడా ఫుడ్ పాయిజన్ కేసులు రాకుండా చూడాలని, క్షేత్రస్థాయిలో పర్యటన అనంతరం నివేదికను సమర్పించాలని, ఇసుక అక్రమ రవాణా, మైనింగ్ వంటివి అరికట్టాలని, గ్రామపంచాయతీ వారిగా 99 రోజుల కార్యకరణ ప్రణాళిక రూపొందించాలని, ఉగాదికి సామూహిక ఇందిరమ్మ గృహప్రవేశాలకు లబ్ధిదారులను సిద్ధం చేయాలని, అదేవిధంగా జూన్ 2 నాటికి కూడా సిద్ధం చేయాలని ఆదేశించారు. రెవిన్యూ అదనపు కలెక్టర్ జే. శ్రీనివాస్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, స్థానిక సంస్థల ఇన్చార్జి అదనపు కలెక్టర్ వై.అశోక్ రెడ్డి, దేవరకొండ ఆర్ డి ఓ రమణారెడ్డి, తహసిల్దారులు, ఎంపీడీవోలు మాట్లాడారు. అంతకు ముందు జిల్లా కలెక్టర్ జనగణన పై తహసిల్దారులకు పలు సూచనలు చేశారు. సిపిఓ శ్రీనివాస్, జిల్లా పరిషత్ సీఈవో శ్రీనివాసరావు, ఇతర అధికారులు ఉన్నారు.



# దేవాలయ చైర్మన్ దళితులకు ఇవ్వాలి

**నార్కట్ పల్లి, మార్చి 5 ( ప్రజా జ్యోతి ):**



దేవాలయాల ట్రస్ట్ బోర్డు చైర్మన్ పదవులను దళితులకు అవకాశం కల్పించాలని భీమ్ ఆర్మీ అధ్యక్షులు వడ్డేపల్లి నాగరాజు ప్రభుత్వాన్ని కోరారు. ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... శ్రీ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం, శ్రీ వారి జాలవేణుగోపాల స్వామి దేవాలయం, సుప్రసిద్ధ క్షేత్రం శ్రీ పార్వతి జడల రామ లింగేశ్వర స్వామి దేవస్థానం ఆలయాల్లో ట్రస్టు బోర్డు చైర్మన్, ఎస్సీ ఎస్టీ కి చెందిన వారికి చైర్మన్ పదవులు కేటాయించాలని, గతంలో కొన్ని సంవత్సరాలుగా సభ్యులుగా అవకాశాలు కల్పించారని, గత కొన్ని సంవత్సరాలుగా సభ్యులకు కూడా అవకాశం కల్పించలేదని, దళితుల పట్ల విపక్షత చూపుతున్నారని, ఈసారి ట్రస్ట్, చైర్మన్ సభ్యులుగా అవకాశం ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతికి సన్మానం



**ఆలేరు మార్చి 4 ప్రజా జ్యోతి**

యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణంలో ప్రభుత్వ కార్యాలయాల తనిఖీకి విచ్చేసిన జిల్లా నూతన కలెక్టర్ అనురాగ్ జయంతిని నూతనంగా ఆలేరు మున్సిపల్ చైర్మన్ గా ఎన్నికైన బీజాన బాలమణి భాస్కర్ గురువారం మర్యాద పూర్వకంగా కలిసి శు భాకాంక్షలు తెలియజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. వారి వెంబడి మండల తాసిల్దార్ ఆంజనేయులు, కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# బీరుసీసా తో యువకుడి పై సోదరుల దాడి

**హత్యయత్నం కేసు నమోదు**

మిర్యాలగూడ,మార్చి 05,( ప్రజాజ్యోతి ): మిర్యాలగూడ పట్టణం లోని సుందర్ నగర్ కాలనీలో బీరు సీసాతో యువకుడి పై దాడి ఘటన బుధవారం రాత్రి జరిగింది. వన్ టౌన్ సీఐ నాగభూషణ రావు తెలిపిన వివరాల ప్రకారం సుందర్ నగర్ కాలనీ కి చెందిన ఎల్తూరి అఖిల్ అనే యువకుడు వీధిలో నడుచుకుంటూ వస్తుండగా అదే కాలనీ కి చెందిన అన్నదమ్ములు పందిరి ఆకాష్, వికాస్ లు హోలీ రోజు జరిగిన పాత గొడవ దృష్టిలోఉంచుకొని అఖిల్ ని దుర్భాషలాడి గొడవ పడ్డారు.పారి పోయెందుకు యత్నించిన అఖిల్ పై ఆకాష్ బీరు సీసాతో దాడి చేసి మెడపై పొడిచి హత్యాయత్నం చేశాడు.అదే సమయంలో అటుగా వెళ్తున్న చెరుకుపల్లి సురేష్ బైకు పై బాదితుణ్ణి రక్షించి ఆస్పత్రికి చేర్చాడు. గురువారం బాధితుని ఫిర్యాదు మేరకు నిందితులపై అటెంప్ట్ మర్డర్ కేసు నమోదు చేసి, నిందితులను అదుపులోకి తీసుకొని రిమాండ్ కితరలించినట్లు సీఐ తెలిపారు .



# 16 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తును తాకట్టు పెడతారా?

## ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు తక్షణమే విడుదల చేయాలి: నేషనల్ ప్రెసిడెంట్ కేతవత్ బాబురామ్ నాయక్ డిమాండ్



**దేవరకొండ,మార్చి 05(ప్రజా జ్యోతి )**

రాష్ట్రంలో విద్యార్థుల పాలిట శాపంగా మారిన ఫీజు రీయింబర్స్‌మెంట్ మరియు స్కాలర్‌షిప్ బకాయిల అంశంపై రైట్ టు ఇన్ఫర్మేషన్ సర్వీస్ సొసైటీ వ్యవస్థాపకులు మరియు జాతీయ అధ్యక్షులు కేతవత్ బాబురామ్ నాయక్ తీవ్రంగా స్పందించారు. 16 లక్షల మంది నిరుపేద, దళిత, గిరిజన మరియు వెనుకబడిన తరగతుల విద్యార్థుల విద్యను నిలిపివేయడం ప్రభుత్వ వైఫల్యమేనని ఆయన ధ్వజమెత్తారు.

ప్రభుత్వ నిర్లక్ష్యంపై బాబురామ్ నాయక్ లేవనెత్తిన ప్రధానాంశాలు:

1. అంధకారంలో 16 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు

రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 16 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వం అందించే స్కాలర్‌షిప్‌లపై ఆధారపడి ఉన్నత చదువులు చదువుతున్నారు. గత రెండు మూడేళ్లుగా పేరుకుపోయిన బకాయిల వల్ల విద్యార్థులు కాలేజీ ఫీజులు చెల్లించలేక, పరీక్షలు రాయలేక మానసిక ఒత్తిడికి లోనవుతున్నారు. ఇది కేవలం ఆర్థిక సమస్య కాదు, ఒక తరాన్ని విద్యాహీనులుగా మార్చే కుట్ర.

2. నిలిచిపోయిన సర్టిఫికెట్లు – కోల్పోతున్న ఉద్యోగ అవకాశాలు

ఫీజు రీయింబర్స్‌మెంట్ రాకపోవడంతో ప్రైవేట్ కాలేజీ యాజమాన్యాలు విద్యార్థుల ఒరిజినల్ సర్టిఫికెట్లను వెనక్కి ఇవ్వడం లేదు. దీనివల్ల చదువు పూర్తయిన విద్యార్థులు ఉద్యోగ ఇంటర్వ్యూలకు వెళ్లలేక, ఉన్నత చదువులకు దరఖాస్తు చేసుకోలేక అగమ్యగోచర స్థితిలో ఉన్నారు. ప్రభుత్వం వెంటనే కాలేజీలతో మాట్లాడి విద్యార్థుల సర్టిఫికెట్లు విడుదల చేయించాలి.

3. 'రైట్ టు ఎడ్యుకేషన్' స్ఫూర్తికి విరుద్ధం

రాజ్యాంగం కల్పించిన విద్యా హక్కును కాలరాయడం దుర్మార్గం. స్కాలర్‌షిప్ నిధులు ఇతర పథకాలకు మళ్లించడం వల్ల హాస్టళ్లలో మెస్ బిల్లులు పెండింగ్‌లో పడి విద్యార్థులు పస్తులు ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. నిధుల మళ్లింపుపై శ్వేతపత్రం విడుదల చేయాలని బాబురామ్ నాయక్ డిమాండ్ చేశారు.

ప్రభుత్వానికి డిమాండ్లు:

తక్షణ నిధుల విడుదల: పెండింగ్‌లో ఉన్న సుమారు 5 వేల కోట్ల రూపాయల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ఒకే విడతలో విడుదల చేయాలి.

డైట్ ఏ మెస్ ఛార్జీలు: పెరిగిన ధరలకు అనుగుణంగా డైట్ ఛార్జీలను పెంచి, పెండింగ్ బిల్లులను క్లియర్ చేయాలి.

ప్రత్యేక విభాగం: స్కాలర్‌షిప్ పంపిణీలో జాప్యం జరగకుండా ఒక ప్రత్యేక పర్యవేక్షణ విభాగం ఏర్పాటు చేయాలి.

న్యాయ పోరాటం: ప్రభుత్వం స్పందించని పక్షంలో, ఆర్.టి.ఐ చట్టం ద్వారా నిధుల మళ్లింపు వివరాలను బయటపెట్టి, విద్యార్థుల తరపున న్యాయ పోరాటానికి సిద్ధమని హెచ్చరించారు.

"ఒక విద్యార్థి చదువు ఆగిపోవడం అంటే ఒక కుటుంబం పేదరికంలోకి వెళ్లడమే. ప్రభుత్వం తక్షణమే స్పందించి బకాయిలు విడుదల చేయాలి, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్త ఆందోళనలు చేపడతాం,అని కేతవత్ బాబురామ్ నాయక్ స్పష్టం చేశారు.

# వినియోగదారుల హక్కులపై చైతన్యం అవసరం -- పోచం సోమయ్య

**మోత్కూర్ మార్చి 5 (ప్రజాజ్యోతి)**

యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్ ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవ వారోత్సవాల సందర్భంగా మోత్కూర్‌లోని మండల సమైక్య భవనంలో నిర్వహించిన స్టార్టప్ విలేజ్ ఎంటర్‌ప్రెన్యూర్ ప్రోగ్రాంలో పాల్గొన్న మహిళల సమావేశంలో వినియోగదారుల హక్కులు, బాధ్యతలపై చైతన్య సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ వినియోగదారుల సంఘాల సమాఖ్య (సిఓటిసిఓ) రాష్ట్ర కార్యదర్శి పోచం సోమయ్య ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి వినియోగదారుడు వస్తువు కొనుగోలు చేసే ముందు దానిపై ముద్రించిన సమాచారాన్ని పూర్తిగా చదవాలని, తప్పనిసరిగా బిల్ లేదా రశీదు తీసుకోవాలని సూచించారు. వస్తువు కొనేటప్పుడు బరువు, ఎంఆర్‌పీ ధర సరిచూసుకోవడంతో పాటు నాణ్యతను కూడా పరిశీలించాలని తెలిపారు. ప్రత్యేకంగా ఎలక్ట్రానిక్ వస్తువులు కొనుగోలు చేసే సమయంలో వారంటీ, గ్యారంటీ కార్డులు బిల్లుతో పాటు తీసుకోవాలని సూచించారు. ఒకవేళ వస్తువు నాణ్యత లోపించి నష్టపోతే వినియోగదారులు కన్స్యూమర్ కోర్టును ఆశ్రయించి నష్టపరిహారం పొందవచ్చని వివరించారు. తూనికలు, కొలతల్లో తేడాలు, ఆహార పదార్థాల్లో నాణ్యత లోపాలు, సేవల్లో నిర్లక్ష్యం లేదా ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో అధికారుల నిర్లక్ష్యం ఉంటే సంబంధిత శాఖలకు ఫిర్యాదు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీఎంలు ఫకీరు, కేపీ రాజు, జిల్లా మహిళ సమాఖ్య అధ్యక్షురాలు రేణుక, మండల మహిళ సమైక్య అధ్యక్షురాలు శైలజ, కోఆర్డినేటర్ లోడే భాస్కర్, వినియోగదారుల మండల ప్రతినిధి పల్లపు సాయి తదితరులు పాల్గొన్నారు.



# భువనగిరిలో పేద ముస్లిం కుటుంబాలకు 'రంజాన్ కానుక

**మేరాజ్ గ్రూప్ ఆఫ్ హైదరాబాద్ వారి సౌజన్యంతో రూ.3లక్షల నిత్య వసర సరుకులతో పాటు 20మందికి నగదు అందజేత**

**మైనార్టీ వెల్ఫేర్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు ఇంతి యాజ్ అహ్మద్ ఆధ్వర్యంలో పంపిణీ**






**నిత్యవసర సరుకులను పంపిణీ చేస్తున్న సబ్ కలెక్టర్ కృష్ణారెడ్డి తో పాటు దాతల పిల్లలు**

**దాత మేరాజ్ గ్రూప్ పిల్లలను సన్మానిస్తున్న సబ్ కలెక్టర్ కృష్ణారెడ్డి, తహసిల్దార్ జగన్ లు**

**వైస్ చైర్మన్ పోతంశెట్టి మంజుల**

**ప్రముఖ అడ్వకేట్ సామ రాజేందర్ రెడ్డి**

**భువనగిరి,మార్చి 5 :**

(ప్రజాజ్యోతి)పవిత్రమైన రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని భువనగిరి పట్టణ,మండల పరిధిలోని నిరుపేద ముస్లిం కుటుం బాలకు గురువారం మేరాజ్ గ్రూప్,ఆఫ్ హైదరాబాద్ సౌజన్యంతో “రంజాన్ తోఫా” పేరుతో నిత్యవసర సరుకులను పంపిణీ చేశారు. జిల్లా కేంద్రంలోని ఇస్లాంపూర్ మసీదు,వద్ద ఏర్పాటు చేసిన ఈ




కార్యక్రమాన్ని జిల్లా మైనార్టీ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు, నేషనల్ జిల్లా అధ్యక్షుడు,వక్ఫ్ బోర్డు ఆఫీషియల్ మెంబర్ ఎండి,ఇంతియాజ్ అహ్మద్ ఆధ్వర్యంలోనిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా,సబ్ కలెక్టర్ కృష్ణారెడ్డి,మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ పోతంశెట్టి మంజుల, తహసీల్దార్ సేకూరి జగన్, ప్రముఖ,అడ్వకేట్ సామ రాజేందర్ రెడ్డి,మౌలానా బఖియతుల్లాహ్ లు హాజరై పేద,ముస్లిం కుటుంబాలకు నిత్యవసర సరుకులను అందజేశారు.ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలు పాటిస్తున్న నిరుపేద కుటుంబాలకు ఈ సహాయం,ఎంతో ఉపయోగ పడుతుందన్నారు.పేదల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచు కొని స్వచ్ఛందంగా సేవా కార్య క్రమాలు చేపడుతున్న మేరాజ్ గ్రూప్ ఆఫ్ హైదరాబాద్ అధినేత నదీమ్ ఖాన్ తో పాటు స్వచ్ఛందంగా పేదలకు పంపిణీ చేస్తున్న ఇంతియాజ్ అహ్మద్ సేవలను ఈ సందర్భంగా ఆయన ప్రత్యేకంగా అభినందించారు. రంజాన్ మాసంలో పేదలకు సహాయం చేయడం గొప్ప సేవ అని అన్నారు.ప్రతి సంవత్సరం నిరుపేద ముస్లిం కుటుం బాలకు నిత్యవసర సరుకులు పంపిణీ చేస్తూ సామాజిక బాధ్యతను నిర్వర్తిస్తున్న మేరాజ్ గ్రూప్ ఆఫ్ హైదరాబాద్ సేవలను ప్రశంసించారు. భువనగిరి తహసీల్దార్ సేకురి జగన్ మాట్లాడుతూ స్థానికంగా పేదల సంక్షేమం కోసం ఎప్పుడు తపన పడే భువనగిరి,బ్రదర్స్ గా జర్నలిస్ట్ లుగా మంచి పేరు సంపాదిం చుకున్నారని అలాగే నిత్యం పేద ప్రజల కొరకు కృషి చేస్తున్న,జిల్లా మైనార్టీ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు ఇంతియాజ్ అహ్మద్,జిల్లా ఉపాధ్యక్షుడు ఎండి ఇస్తియాక్‌లను అభినందిం చారు.మున్సిపల్ వైస్ చైర్మన్ పోతంశెట్టి మంజుల మాట్లాడుతూ ఒకవైపు జర్నలిజం వృత్తిలో కొనసా గుతూ మరోవైపు పలు సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతు,పట్టణ ప్రజల అభిమానాన్ని చూర గొంటున్న సామాజిక సేవకుడు ఇంతియాజ్ అహ్మద్ కు తాము,నిత్యం అండగా ఉంటామని తెలిపారు. జిల్లా మైనార్టీ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు ఇంతియాజ్ అహ్మద్,జిల్లా ఉపాధ్యక్షుడు అహ్మద్ లు మాట్లాడుతూ ప్రతి ఏటలాగే ఈసారి కూడా మేరాజ్ గ్రూప్,ఆఫ్ హైదరా బాద్ చైర్మన్ నదీమ్ ఖాన్ సౌజన్యంతో సుమారు రూ.3 లక్షల,విలువైన నిత్యవసర సరుకులను పేద ముస్లిం కుటుంబాలకు పంపిణీ చేసినట్లు తెలిపారు.ప్రతి కుటుంబానికి సుమారు రూ.2500,విలువైన బియ్యం పప్పులు,నూనె తో పాటు ఇతర నిత్యవసర వస్తువులు అందజేసినట్లు చెప్పారు.అదే విధంగా,20 మంది పేద కుటుంబాలకు నిత్యవసర సరుకులతో పాటు నగదును పంపిణీ చేయడం జరిగింద న్నారు.ఇంకా సరుకులు అందని అర్హులైన కుటుంబాలు నిరాశ చెందవద్దని,త్వరలో వారికి కూడా సహాయం అందేలా చర్యలు తీసుకుం టామని హామీ ఇచ్చారు. పవిత్రమైన రంజాన్ మాసంలో పేదలను గుర్తించి వారికి తమకు తోచిన సహాయం అందించడమే,తమ ప్రధాన లక్ష్యమని ఇంతియాజ్, ఇస్తియాక్ అహ్మద్ లు అన్నారు.తమపై విశ్వాసం ఉంచి ప్రతి సంవత్సరం సహకారం,అందిస్తున్న మేరాజ్ గ్రూప్ ఆఫ్ హైదరాబాద్ చైర్మన్ నదీమ్ ఖాన్‌కు వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. నిత్య వసర సరుకులు అందుకున్న పలువురు లబ్ధిదారులు మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా మేరాజ్ గ్రూప్ వారు అందిస్తు న్న సహాయం తమకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని, ఆ సహాయంతో తమ కుటుం బాలు రంజాన్ పండుగను ఆనందంగా జరుపుకుం టున్నామని తెలిపారు.మేరాజ్ గ్రూప్ వ్యవస్థాపకులు నదీమ్ ఖాన్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో దాతలు రయీద్ ఖాన్, ఉబయ్ ఖాన్, ఈ కార్య క్రమంలో దాతలు రయీద్ ఖాన్,ఉబయ్ ఖాన్, మైనార్టీ వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సయ్యద్ రఫీఖ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి కామ్రాన్ హుస్సేన్,కార్యదర్శి సయ్యద్ రేయ్యాన్,అదిల్ వసీమ్,మౌలానా బాఖియ తుల్లాహ్ ఎండీ మొఖ్తార్ అహ్మద్,రిదా మరియం, కావేర,నాజ్,ఆదిల్,రషీద్ వసీమ్,తదితరులు పాల్గొన్నారు.




# మోత్కూరులో ట్రాక్టర్ యూనియన్ ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్‌పర్సన్‌కు సన్మానం



**మోత్కూరు మార్చి 5 (ప్రజాజ్యోతి)**

యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్ మున్సిపల్ కేంద్రంలో శ్రీ రామలింగేశ్వర ట్రాక్టర్ యూనియన్ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మోత్కూర్ మున్సిపల్ ఛైర్‌పర్సన్ గడ్డం స్వప్న సోమనర్సయ్య, వైస్ చైర్మన్ పల్లెర్ల వెంకన్న హాజరయ్యారు. ఈ సందర్భంగా యూనియన్ సభ్యులు వారికి శాలువా కప్పి పుష్పగుచ్ఛాలు అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో మాట్లాడిన ఛైర్‌పర్సన్ గడ్డం స్వప్న సోమనర్సయ్య, ట్రాక్టర్ యజమానులు మరియు కార్మికులు గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. ట్రాక్టర్ యూనియన్ సభ్యులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు మున్సిపాలిటీ తరపున అవసరమైన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. వైస్ చైర్మన్ పల్లెర్ల వెంకన్న కూడా యూనియన్ సభ్యుల ఐక్యత అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు కుర్మెల్లా ప్రమీల, మొగుళ్ళ అనురాధ, పన్నాల శ్రీవిద్య శ్రీనివాస్, గానగాని శైలజ, కారాపోతుల వెంకన్న, మెంట రమణ నాగేష్, సుల్తాన్ స్వామి, కొండా శోభ పాల్గొన్నారు. అలాగే ట్రాక్టర్ యూనియన్ సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఫైళ్ళ దయాకర్ రెడ్డి కుమార్తె వివాహ వేడుకలో పాల్గొన్న డా. గాదరి కిశోర్ కుమార్

**మోత్కూరు మార్చి 5 (ప్రజాజ్యోతి)**

ఘట్‌కేసర్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఘట్‌కేసర్ పట్టణంలోని ఔషాపూర్ డిజీఆర్ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన మోత్కూర్ మండల బీఆర్ఎస్ పార్టీ నాయకుడు ఫైళ్ళ దయాకర్ రెడ్డి కుమార్తె స్రవంతి -- ప్రవీణ్ వివాహ వేడుక ఘనంగా జరిగింది. ఈ వివాహ వేడుకకు తుంగతుర్తి మాజీ శాసనసభ్యులు డా. గాదరి కిశోర్ కుమార్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆయన దంపతులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారు ఆనందంగా, ఐశ్వర్యంగా జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి పలువురు బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, బంధుమిత్రులు పెద్ద సంఖ్యలో హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.



# అంగన్వాడి భవనానికి శంకుస్థాపన.



నాగారం మార్చి 5 ప్రజా జ్యోతి.

మండల పరిధిలోని మాచిరెడ్డిపల్లి గ్రామంలో అంగన్వాడీ కేంద్రానికి గ్రామ సర్పంచ్ వడ్డె వెంకన్న గురువారం శంకుస్థాపన చేసి నిర్మాణ పనులు ప్రారంభించారు. భవనానికి పిన్నమరెడ్డి రాఘవరెడ్డి జ్ఞాపకార్థం ఆయన ముగ్గురి కుమారులు పిన్నమ్మ రెడ్డి రవీందర్ రెడ్డి పిన్నమరెడ్డి సురేందర్ రెడ్డి పిన్నమరెడ్డి నరేందర్ రెడ్డి తమ సొంత స్థలం గ్రామపంచాయతీకి రాసి ఇవ్వడం జరిగింది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వడ్డె వెంకన్న ఉప సర్పంచ్ నాతి నాగమణి పంచాయతీరాజ్ ఏఈ మహేష్ పంచాయతీ కార్యదర్శి ఓరుగంటి నరేష్ పసుపులేటి వెంకట్ రెడ్డి వడ్డే మహేష్ షీలా కృష్ణమూర్తి కాంగ్రెస్ యూత్ కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి నాతి శ్రీనివాస్ నాయకులు శీల లింగమల్లు మాదా సోమరాజు నాతి మహేష్ ఈదుల రవిశంకర్ వడ్డే వెంకన్న ఈదుల అంజయ్య రాయరపు సంతోష తాటి సోమలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ఎంపీ--ఎమ్మెల్యే చొరవతో... పోచంపల్లి నుంచి దిల్‌సుఖ్‌నగర్‌కు కొత్త బస్సు సర్వీసులు

భూదాన్ పోచంపల్లి, మార్చ్ 05 (ప్రజాజ్యోతి)

ప్రజల రవాణా సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని పోచంపల్లి నుంచి దిల్‌సుఖ్‌నగర్‌కు వెళ్లే మార్గంలో మరో రెండు ఆర్టీసీ బస్సు సర్వీసులను దిల్‌సుఖ్‌నగర్ డిపో మేనేజర్ సమంత, మున్సిపల్ ఛైర్మన్ తడక వెంకటేశ్వర్లు కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఛైర్మన్ తడక వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, పోచంపల్లి ప్రజల రవాణా సౌకర్యం కోసం ప్రత్యేకంగా చొరవ చూపిన భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కొత్త బస్సు సర్వీసులతో పోచంపల్లి--దిల్‌సుఖ్‌నగర్ మధ్య ప్రయాణం మరింత సులభంగా మారుతుందని ఆయన తెలిపారు. పోచంపల్లి ప్రాంతానికి చెందిన ప్రయాణికులు, ఉద్యోగులు, విద్యార్థులు ప్రతిరోజూ దిల్‌సుఖ్‌నగర్‌కు పెద్ద సంఖ్యలో ప్రయాణిస్తుంటారు. ఈ నేపథ్యంలో ప్రజలకు మరింత సౌకర్యం కల్పించాలనే ఉద్దేశంతో అదనంగా రెండు బస్సులను ప్రారంభించినట్లు తెలిపారు. కొత్త సర్వీసులు ప్రారంభం కావడంతో స్థానిక ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో ఎడిసి శ్రీనివాస్ రెడ్డి, ఎమ్.వి.ఎన్. రావు, బుచ్చిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ అంజన్ రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పాక మల్లేష్ యాదవ్, కౌన్సిలర్లు కొండమడుగు ఎల్లస్వామి, దేవరాయ కుమార్, రావుల జంగయ్య, సూరపల్లి రాధిక రమేష్, ఆర్టీసీ అధికారులు మరియు స్థానిక నాయకులు ప్రజలు పాల్గొన్నారు.



# తక్కువ రేటుకు బంగారం ఇప్పిస్తానంటూ మోసం

## నిందుతుని వద్ద 4 లక్షల నగదు,సెల్ ఫోన్ స్వాధీనం

మిర్యాలగూడ, మార్చి 05,( ప్రజాజ్యోతి ):

తక్కువ రేటుకు బంగారం ఇప్పిస్తానంటూ మోసం చేసి లక్షలు దండుకున్న నిందితుడిని అరెస్టు చేసినట్లు మిర్యాలగూడ డి.ఎస్.పి కె.రాజశేఖర్ రాజు తెలిపారు. గురువారం స్థానిక సబ్ డివిజన్ పోలీస్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో నిందితున్ని



హాజరు పరిచి కేసు వివరాలు వెల్లడించారు. మాడుగులపల్లి మండలం, భీమనపల్లి గ్రామానికి చెందిన నిందితుడు లొడంగి యాదగిరి మిర్యాలగూడ పట్టణంలోని ముత్తూట్ ఫిన్ కార్ప్, హౌసింగ్ లోన్స్ భాగంలో మేనేజర్ గా పని చేస్తున్నాడు. కాగా లక్షలు దండుకోవాలని దురాశతో ఫైనాన్స్ సంస్థలలో కుదవ పెట్టిన బంగారంను తక్కువ ధరకే ఇప్పిస్తానని కొందరి వద్ద లక్షలు దండుకుంటున్నాడు. ఈ క్రమంలో మండల శంకర్ కు చెందిన బంగారం ఐ ఐ ఎఫ్ ఎల్ ఫైనాన్స్ సంస్థలో కుదవపెట్టి రుణం



తీసుకుని తిరిగి చెల్లించ లేకపోవడం తో గతం లో అక్కడ పనిచేసిన యాదగిరి ని ఆశ్రయించాడు. ఇదే అదునుగా యాదగిరి తనకు తెలిసిన బంగారు షాప్ యజమాని సొల్లేటి కనకాచారి ద్వారా బంగారు వ్యాపారి మాదూరి ఉపేంద్ర చారి వద్ద 9.60 లక్షలకు బేరం కుదుర్చుకొని తీరా డబ్బు చెల్లించే సమయంలో శంకర్ కు కరెంటు ఎకౌంటు లేదని, డబ్బును తన అకౌంట్లోకి బదిలీ చేయించుకున్నాడు. అనంతరం బంగారం విడిపించకుండా మాయమాటలతో మభ్య పెట్టడంతో మోసపోయామని గ్రహించిన ఉపేంద్రచారి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకున్న వన్ టౌన్ పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకొని విచారించగా నిందితుడు గతంలో సుధీర్ అనే వ్యక్తిని కూడా ఇదే రీతిలో మోసగించినట్లు వెలుగు చూసినట్లు తెలిపారు. నిందితుడి వద్ద నాలుగు లక్షల రూపాయలను, సెల్ ఫోను స్వాధీన పరుచుకొని రిమాండ్కు తరలించినట్లు తెలిపారు. కేసును చాకచక్యంగా చేదించిన వన్టౌన్ సిఐ ఎం. నాగభూషణ రావు, ఎస్సై సైదిరెడ్డి, సిబ్బంది రాజారాం, వీరబాబు, నరసింహ,ప్రసాద్ లను డి.ఎస్.పి ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

# మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి లతోనే కోదాడ అభివృద్ధి సాధ్యం

## మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ వేపూరి తిరుపతమ్మ సుధీర్

కోదాడ టౌన్, మార్చి 05 (ప్రజా జ్యోతి):

అప్పుడు ఇప్పుడు ఎప్పుడు కోదాడ నియోజకవర్గం అభివృద్ధి మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మా రెడ్డి గారితోనే సాధ్యమవుతుందని కోదాడ వ్యవసాయం మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ వేపూరి తిరుపతమ్మ సుధీర్ అన్నారు గురువారం వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో చైర్మన్ అధ్యక్షతన కోదాడ పట్టణ నూతనంగా ఎన్నికైన చైర్మన్ వైస్ చైర్మన్ కౌన్సిలర్లకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ కోదాడ నియోజకవర్గం అభివృద్ధి చేయడానికి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి గార్ల నాయకత్వంలో వేలకోట్ల రూపాయలు నిధులు తీసుకువచ్చి కోదాడ నియోజకవర్గం లో గడిచిన 30 సంవత్సరాల నుండి అవినీతి మచ్చ లేకుండా పాడన కొనసాగిస్తున్న ఘనత మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి గారికి దక్కుతుందన్నారు తాగునీరు సాగునీరు డ్రైనేజ్ సిసి రోడ్లు అన్ని గ్రామాలకు రోడ్లు సౌకర్యం తో పాటు విద్య వైద్యం ఇందిరామ్మ ఇల్లు తో ప్రజలకు బావితరాలకు ఉపయోగపడే విధంగా ప్రణాళికలు రచించి ఎలాంటి వర్గ బేధాలు లేకుండా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. మచ్చలేని నాయకుల నాయకత్వంలో మనందరం పనిచేయడం అదృష్టమన్నారు నూతన పాలకవర్గ సభ్యులు కోదాడ పట్టణాన్ని మరింత అభివృద్ధి చేయాలని భావితరాలకు ఉపయోగపడే విధంగా సంక్షేమమ్ అభివృద్ధిని అందించాలని వారిని ఆకాంక్షించారు అనంతరం చైర్మన్ వైస్ చైర్మన్ కౌన్సిలర్లను మార్కెట్ చైర్మన్ పాలక సభ్యులను ఘనంగా సన్మానించారు కార్యక్రమాల్లో మున్సిపాలిటీ చైర్మన్ ఎర్నేని కుసుమ బాబు వైస్ చైర్మన్ రాజేశ్వరి మున్సిపాలిటీ కౌన్సిలర్లు మార్కెట్ కమిటీ డైరెక్టర్లు వీరబాబు వేంకట్ రెడ్డి సూర్యం వేంకటేశ్వర్లు కోటయ్య మణెమ్మ నర్సిరెడ్డి శ్రీను అభిరామ్ శ్రీనివాస్ అమర్ సింగ్ వేణు తదితరులు ఉన్నారు.



# అంతర్రాష్ట్ర బైకు దొంగలు అరెస్టు

-ఆరు బైకులు స్వాధీనం.

-నిందితులపై పలు పోలీస్ స్టేషన్ లో కేసులు నమోదు.

-హుజూర్ నగర్ సీఐ చరమందరాజు



హుజూర్ నగర్,మార్చి 5:(ప్రజా జ్యోతి)

బైక్ దొంగతనాలకు పాల్పడుతున్న అంతరాష్ట్ర దొంగల ముఠాను అరెస్టు చేసి నిందితుల నుంచి ఆరు మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకొని రిమాండ్ కు తరలించినట్లు హుజూర్ నగర్ సీఐ చరమంద రాజు తెలిపారు. గురువారం పట్టణంలోని సీఐ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ మాట్లాడుతూ పట్టణంలోని కొత్త బస్టాండ్ ఆవరణలో ఇద్దరు వ్యక్తులు హెచ్ఎఫ్ డీలక్స్ బైక్‌పై అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఇద్దరు వ్యక్తులు పోలీసులను చూడగానే పారిపోయేందుకు ప్రయత్నించగా యస్ఐ మోహన్ బాబు తన సిబ్బందితో కలిసి వారిని అదుపులోకి తీసుకొని విచారించగా,దొంగతనాల అసలు విషయం వెలుగులోకి వచ్చిందన్నారు.పోలీసుల విచారణలో నిందితులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన గుంటూరు జిల్లా మేడికొండూరు గ్రామానికి చెందిన షేక్ మాబు, షేక్ రిహాజ్‌గా గుర్తించామని తెలిపారు.ఉమ్మడి నల్గొండ , గుంటూరు జిల్లాల్లో దొంగతనాలకు పాల్పడినట్లు వారు అంగీకరించారు.దొంగిలించిన ఆరు బైకులను స్వాధీనం చేసుకుని, నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు. కార్యక్రమంలో యస్ఐ మోహన్ బాబు, పోలీస్ సిబ్బంది శ్రీనివాసరెడ్డి,శంభయ్య, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామంలో తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకుంటా.. సర్పంచ్ స్నేహ దుర్గయ్య





కోదాడ రూరల్, మర్చి 05( ప్రజాజ్యోతి)

:వచ్చే వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని గ్రామ ప్రజలకు త్రాగునీరు, నిత్య అవసరాలకు అవసరమైన నీరుకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సంబంధిత అధికారులు నిత్యం అందుబాటులో ఉండేలా చర్యలు చర్యలు తీసుకుంటున్నామని సర్పంచ్ బల్గూరి స్నేహ దుర్గయ్య అన్నారు. మండల పరిధిలోని గణపవరం గ్రామంలో రానున్న యాసవ కాలాన్ని దృష్టిలో పెట్టుకొని తాగునీటి సమస్య రాకుండా ఉండాలనే ఉద్దేశ్యంతో గ్రామీణ జల సరఫరా శాఖ (ఆర్డబ్ల్యూఎస్) అధికారులు ఈఈ శ్రీనివాసరావు, డిఈ దేవాబిక్షం, ఏఈ రవి నాయక్ లను గ్రామానికి ఆహ్వానించడం జరిగింది. ఈ సందర్భంగా గ్రామంలో ఉన్న తాగునీటి పరిస్థితులను వారికి వివరించి, బోర్ బావులు,చేతి పంపులను అధికారులతో కలిసి ప్రత్యక్షంగా పరిశీలించారు. అలాగే అవసరమైన ప్రాంతాల్లో కొత్త బోర్లు, చేతి పంపులు ఏర్పాటు చేయుటకు ఎస్టిమేట్లు ఇవ్వాలని అధికారులను అభ్యర్థించడం జరిగింది. గ్రామ ప్రజలకు వేసవి కాలంలో త్రాగునీటి సమస్యలు రాకుండా ఉండేందుకు అధికారులకు వివరించడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శంకరశెట్టి కోటేశ్వరరావు, కాసాని సత్యం, నల్లాని చెన్నయ్య, రామారావు, హీరం, నాగ స్వరూప్, కృష్ణయ్య, రవి, తోకల గోపి, గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## భక్తుల నామస్మరణతో... ఘనంగా లక్ష్మీనారాయణ స్వామి రథోత్సవం

భూదాన్ పోచంపల్లి, మార్చ్ 05 (ప్రజాజ్యోతి)

పట్టణ కేంద్రంలోని ప్రముఖ దేవస్థానం శ్రీ లక్ష్మీ నారాయణస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా గురువారం రథోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. రథోత్సవం సందర్భంగా ఉదయం స్వామివారి మేలుకొలుపు, నిత్యఆరాధన, వ్రతహోమం, వ్రత బలిహరణ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పట్టణంలోని పలు వీధుల గుండా కోలాటాలు, భజనల మధ్య స్వామివారి రథాన్ని ఊరేగింపుగా తీసుకువెళ్లారు. లక్ష్మీ నారాయణ స్వామి నామస్మరణతో భక్తులు రథం వెంట నడుస్తూ భక్తి భావంతో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ అంకం వినోద్, తడక గౌరీశంకర్, ధర్మకర్తలు మోటె మహేష్, కుసుమ వెంకటేశం, చేరాల సుధీర్ కుమార్, గోశిక శివకుమార్, వేశాల మురళి, జినుకల కుమార్, కూరపాటి బాబు, మూషం శ్రీను, సకినాల నాగయ్య, చెరుకు శ్రీకాంత్ గౌడ్, గుణిగంటి సుభాష్ గౌడ్, బోడ సత్యనారాయణ, పెద్దల ముత్యాలు, చేరాల శ్రీకాంత్, సైదుగాని రాములు, కోట మహేందర్ రెడ్డి, బత్తుల బాలాజీ, చేరాల మహేందర్, పొనమోని కావ్య, శెట్టి మణికుమార్, వంగూరి బాలకృష్ణ, జినుకల శ్రీకాంత్, పాపని ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.



## బైక్ టిప్పర్ ఢీ.. ఒకరు మృతి .. మరొకరికి గాయాలు

మోతె మర్చి 5(ప్రజా జ్యోతి ):



బైకును టిప్పర్ ఢీకొన్న ఘటన సూర్యాపేట – ఖమ్మం జాతీయ రహదారి పై చోటు చేసుకుంది.స్థానికులు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గోల్ తండా గ్రామానికి చెందిన ధరావత్ మంగత్య, ధరావత్ హరిజ అనే ఇద్దరు వ్యక్తులు బ్రతుకుతెరువు కోసం సూర్యాపేట వెళు తుండగా మోతె మండల కేంద్రం లోని గ్రామ శివారులో కంకర లోడ్ తో రాంగ్ రూట్ లో వస్తున్న టిప్పర్ ఢీకొట్టడంతో ఇద్దరికీ తీవ్ర గాయాలు కావడంతో సూర్యాపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా హరిజ అనే వ్యక్తి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం ఖమ్మం ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. మంగత్య ప్రస్తుతం సూర్యపేట ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ ప్రమాదానికి కారణమైన టిప్పర్ డ్రైవర్ ఉడుముల ప్రభాకర్ పై కేసు నమోదు చేసి వాహనాన్ని పోలీస్ స్టేషన్కు తరలించారు.



## పేద కుటుంబానికి సొంతిల్లు... మెహర్‌నగర్‌లో ఇందిరమ్మ ఇల్లు ప్రారంభం

భూదాన్ పోచంపల్లి, మార్చ్ 05 (ప్రజాజ్యోతి)

మండలంలోని మెహర్‌నగర్‌లో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇల్లు చిలువేరు రేణు చందర్ ఇంటిని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పాక మల్లేష్ యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలు మరింత వేగంగా కొనసాగాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సిలివేరు లక్ష్మయ్య, మాజీ సర్పంచ్ పూజిత సంపత్ రెడ్డి, రేవల్లి యాదయ్య, గ్రామ శాఖ అధ్యక్షులు ఆకుల శ్రీలత, వార్డు సభ్యులు కళ్లెం సాయిలు, బూరుగు వెంకటేశం, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



## శీర్షిక: మంజుల అనే నేను

# అంశం: అంతర్జాతీయ మహిళా దినోత్సవం

**ఆలేరు మార్చి 5 ప్రజా జ్యోతి**

గాయాల్ని గుండెల్లో దాచుకుని
గర్వంగా నవ్వడం నేర్చుకున్నాను!
పడిపోతూ కూడా నిలబడటం నేర్చుకున్నాను!

నిశ్శబ్దంగా కనిపించినా
నిర్ణయాల్లో గర్జించే శక్తిని నేను!
నేను మహిళను మాత్రమే కాదు
మార్పుకు మొదటి అడుగు నేను!

నన్ను ఆపాలని ప్రయత్నించిన చేతులు
ఇప్పుడు నా విజయానికి చప్పట్లు కొడుతున్నాయి!
నన్ను ఆపాలని వచ్చిన చీకట్లు
ఇప్పుడు నా వెలుగుకే దారి చూపించాయి!

కన్నీరు పొంగిన ప్రతి క్షణం
నా గుండెల్లో విప్లవం మేల్కొంటుంది!
నన్ను ఆపాలని వచ్చిన ప్రతి మాట
ఇప్పుడు నా విజయ గీతంగా మారుతోంది!

నేను వంటింటి పొగ కాదు
నిరాశలో ఉన్న మహిళా హృదయాలకు ఆశ నింపి
వెలుగుజ్యోతిని వెలిగించాను!

నన్ను అబల అని అన్న వారందరికీ
సహనాన్ని ఆయుధంగా మార్చుకొని
నాయకురాలిగా దారులు చూపించాను!

ఇల్లు నుంచి దేశం వరకు
ప్రతి రంగంలో వెలుగునిచ్చే
ప్రతి మగువకు నా హృదయపూర్వక వందనాలు తెలుపుతూ...
అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు.



శ్రీమతి మంజుల పత్తిపాటి (కవయిత్రి).
మాజీ ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్
యాదాద్రి భువనగిరి జిల్లా
తెలంగాణ రాష్ట్రం
చరవాణి 9347042218

# కోదాడ మండలంలో ఏరులై పారుతున్న మద్యం..

**నిమ్మకు నీరెత్తినట్లు ఎక్సైజ్ శాఖ!**

**గ్రామగ్రామానా 'బెల్టు' బాదుడు..**

**మామూళ్ల మత్తులో అబ్కారీ అధికారులు?**

**గంజాయి విక్రయాలపై నిఘా కరువు –**

**బెల్టు షాపుల బెల్టు తీయని ఎక్సైజ్ అధికారులు**

**గ్రామాలవారీగా మద్యం ఏరులై పారుతున్నా పట్టించుకోని వైనం.**

**యువత భవిష్యత్తు అంధకారం!**

**కోదాడ ఎమ్మెల్యే ఆదేశాలకు 'అబ్కారీ' తూట్లు!**

**బెల్టు షాపులపై ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి సీరియస్..**

**పట్టించుకోని ఎక్సైజ్ అధికారులు**

**కోదాడ రూరల్.మార్చ్ 5 ( ప్రజాజ్యోతి ):**

కోదాడ నియోజకవర్గంలో శాంతిభద్రతల పరిరక్షణకు, యువత భవిష్యత్తును కాపాడటానికి ఎమ్మెల్యే నలమాద ఉత్తం పద్మావతి రెడ్డి అక్రమ మద్యం, గంజాయిపై యుద్ధం ప్రకటించినప్పటికీ, క్షేత్రస్థాయిలో ఎక్సైజ్ శాఖ వైఖరి మాత్రం అందుకు భిన్నంగా ఉంది. ఎమ్మెల్యే నియోజకవర్గ అభివృద్ధి సమీక్షల్లో మరియు బహిరంగ సభల్లో డ్రగ్స్‌కు నో చెప్పండి అనే నినాదం తో ప్రసంగాలు చేస్తున్నప్పటికీ,గంజాయిని, అక్రమ బెల్టు షాపులను పూర్తిగా అరికట్టాలని అధికారులను కఠినంగా ఆదేశిస్తున్న. అయినప్పటికీ, కోదాడ ఎక్సైజ్ విభాగం మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.నియోజకవర్గంలో మహిళలు, కుటుంబాల విన్నపాలను ఆలకించిన ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి, గ్రామాల్లో బెల్టు షాపులు ఉండకూడదని అధికారులకు స్పష్టమైన సంకేతాలిచ్చారు. కానీ, ఎక్సైజ్ శాఖ మాత్రం నామమాత్రపు దాడులతో కాలం వెళ్లదీస్తోందన్న ఆరోపణలు వస్తున్నాయి. ఎమ్మెల్యే ప్రత్యేకంగా గంజాయి రవాణాను అరికట్టాలని పోలీసు మరియు ఎక్సైజ్ శాఖలకు ఆదేశాలిచ్చినప్పటికీ, కోదాడ సరిహద్దు ప్రాంతాల నుండి నియోజకవర్గంలోని పల్లెలకు గంజాయి చేరుతూనే ఉంది. ఎక్సైజ్ నిఘా వైఫల్యం వల్ల విద్యార్థులు, యువకులు ఈ మత్తు ఊబిలో కూరుకుపోతున్నారు. ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి కోదాడను డ్రగ్స్ రహిత నియోజకవర్గంగా తీర్చిదిద్దాలని ప్రయత్నిస్తుంటే, ఎక్సైజ్ శాఖ వైఫల్యం ఆ ఆశయానికి విఘాతం కలిగిస్తోంది. ఎమ్మెల్యే ఇంత కఠినంగా చెప్తున్నా అధికారులు ఎందుకు స్పందించడం లేదు?" అని స్థానిక మహిళా సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని, ఎమ్మెల్యే ఆదేశాలను అమలు చేయని అధికారులపై చర్యలు తీసుకోవాలని, కోదాడ మండలంలోని బెల్టు షాపులను, గంజాయిని పూర్తిగా నిర్మూలించాలని కోరుతున్నారు.కోదాడ మండల వ్యాప్తంగా బెల్టు షాపుల (అనధికార మద్యం విక్రయ కేంద్రాలు) ఆగడాలు మితిమీరిపోతున్నాయి. మండలంలోని ప్రతి గ్రామంలోనూ, చివరకు వీధి వీధినా బెల్టు షాపులు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నా, సంబంధిత ఎక్సైజ్ శాఖ అధికారులు పట్టించుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అక్రమ మద్యం, గంజాయి రవాణాను అరికట్టాల్సిన ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ తన బాధ్యతను విస్మరించి, కేవలం ఆదాయంపైనే దృష్టి పెట్టిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

## ఎవరిది బాధ్యత? సివిల్ పోలీసులా, ఎక్సైజ్ శాఖా?


చట్టపరంగా మద్యం నియంత్రణ, అక్రమ విక్రయాల అరికట్టడం వంటివి పూర్తిగా ఎక్సైజ్ శాఖ బాధ్యతే. తెలంగాణ ఎక్సైజ్ చట్టం, 1968 ప్రకారం బెల్టు షాపులపై దాడులు చేసే అధికారం వీరికి ఉంది. అయితే, కోదాడ ఎక్సైజ్ అధికారులు మాత్రం ఈ బాధ్యతను సివిల్ పోలీసులపైకి నెట్టేస్తూ తప్పించుకుంటున్నారనే విమర్శలు ఉన్నాయి. సివిల్ పోలీసులు శాంతిభద్రతల కోసం పని చేస్తారు, కానీ మద్యం, గంజాయి వంటి ప్రత్యేక నేరాలను అరికట్టడానికి ప్రభుత్వమే ప్రత్యేకంగా ఎక్సైజ్ విభాగాన్ని ఏర్పాటు చేసింది. అలాంటప్పుడు ఆ శాఖ అధికారులు మౌనంగా ఉండటం ఎంతవరకు కరెక్ట్ అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.మద్యం వ్యాపారులతో ఎక్సైజ్ అధికారులకు ఉన్న లోపాయికారి ఒప్పందాల వల్లే బెల్టు షాపులు విచ్చలవిడిగా కొనసాగుతున్నాయని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.

## గంజాయి మత్తులో యువత:

మండలంలో గంజాయి విక్రయాలు రహస్యంగా సాగుతున్నా, ఎక్సైజ్ నిఘా విభాగం విఫలమైంది. సరిహద్దుల నుండి వస్తున్న మాదకద్రవ్యాలను అడ్డుకోవడంలో ఎక్సైజ్ శాఖ వైఫల్యం యువత భవిష్యత్తును నాశనం చేస్తోంది. మద్యం దుకాణాలు నిర్ణీత సమయాల కంటే ముందుగానే తెరవడం, రాత్రి ఆలస్యంగా విక్రయాలు సాగించడం వంటివి నిత్యకృత్యమయ్యాయి.
ప్రజల ఆందోళన చెందుతున్నారు. మద్యం మత్తులో రోడ్లపై జరుగుతున్న గొడవలు, కుటుంబాల్లో చిచ్చు పెడుతున్న బెల్టు షాపులపై మహిళా సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

## తనిఖీలు 'వైన్స్' కే.. బెల్టు షాపులకు 'రక్షణ'?

ఎక్సైజ్ అధికారులు ప్రతిరోజూ లైసెన్స్ ఉన్న మద్యం దుకాణాలను సందర్శిస్తూ, స్టాక్ తనిఖీలు మరియు సేల్స్ రిపోర్టులకే పరిమితమవుతున్నారు. దీని వెనుక కేవలం ప్రభుత్వ ఆదాయ లక్ష్యాలను చేరుకోవడం మరియు తమకు అందాల్సిన 'నెలవారీ' మామూళ్లను చక్కబెట్టుకోవడమే లక్ష్యమని ప్రజలు ఆరోపిస్తున్నారు. కానీ, అవే మద్యం దుకాణాల నుండి సరుకును గ్రామాల్లోని కిరాణా షాపులకు, బెల్టు షాపులకు తరలిస్తుంటే ఎక్సైజ్ శాఖ ఎందుకు మౌనంగా ఉంటుందో సమాధానం లేని ప్రశ్నగా మిగిలింది.కోదాడ ప్రాంతం అంతర్రాష్ట్ర సరిహద్దులకు దగ్గరగా ఉండటంతో గంజాయి మాఫియా రెచ్చిపోతోంది. పోలీస్ శాఖ అప్పుడప్పుడు భారీగా గంజాయిని పట్టుకుంటున్నా, ఎక్సైజ్ శాఖకు చెందిన ఇంటెలిజెన్స్ విభాగం నిఘా పెట్టడంలో ఘోరంగా విఫలమైంది. యువత మత్తుకు బానిసై ప్రాణాలు తీసుకుంటున్నా, ఎక్సైజ్ అధికారులు మాత్రం కేవలం ఏసీ రూములకే పరిమితం అవుతున్నారన్న విమర్శలు పతాక స్థాయికి చేరాయి.కోదాడ ఎక్సైజ్ అధికారులు ఇప్పటికైనా నిద్ర మత్తు వీడి, తక్షణమే మండలంలోని బెల్టు షాపులపై ఉక్కుపాదం మోపాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో ప్రజలే రోడ్లపైకి వచ్చి ఎక్సైజ్ కార్యాలయాన్ని ముట్టడించే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు.



# గ్రామ ప్రజలకు వరంగా ఉచిత కంటి పరీక్షల శిబిరం :- సర్పంచ్ ఇందిరా నర్సయ్య

**మునగాల, మార్చి 5 (ప్రజా జ్యోతి):**

మునగాల మండల పరిధిలోని నర్సింహులగూడెం గ్రామంలో సీపీఎం పార్టీ గ్రామశాఖ మరియు గ్రామ పాలకవర్గం ఆధ్వర్యంలో, సర్పంచ్ కుంచం ఇందిరా నర్సయ్య కృషితో లయన్స్ క్లబ్ వారి సౌజన్యంతో ఉచిత కంటి పరీక్షల శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో గ్రామ ప్రజలకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సర్పంచ్ కుంచం ఇందిరా నర్సయ్య మాట్లాడుతూ, ఈ శిబిరం ద్వారా సుమారు 250 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా, అందులో 20 మందికి కంటి ఆపరేషన్ చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. గ్రామ ప్రజలకు ఇలాంటి సేవా కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని, భవిష్యత్తులో కూడా ఇలాంటి కార్యక్రమాలు నిరంతరం కొనసాగించేందుకు కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, సీపీఎం పార్టీ గ్రామశాఖ కార్యదర్శి, జిల్లా కమిటీ సభ్యురాలు జూలకంటి



విజయలక్ష్మి, కోట గోపి, నర్సయ్య, వెంకటరెడ్డి, గ్రామ పెద్దలు, మహిళలు, వృద్ధులు, యువకులు మరియు గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# బోరు, ట్యాంకు నిర్మాణం -- దారుల్ హిదాయా ఫౌండేషన్ సేవలు



**చింతలపాలెం మార్చి 5 (ప్రజా జ్యోతి) :**

సమాజ సమస్యలపై స్పందించడం దారుల్ హిదాయా ఫౌండేషన్ ముఖ్య ఉద్దేశమని ఫౌండేషన్ చైర్మన్ షేక్ హాఫీజ్ అల్లా భక్షు తెలిపారు. చింతలపాలెం మండలం చింత్రియాల గ్రామ మజీద్‌లో నీటి కొరత ఉందని తెలుసుకున్న ఫౌండేషన్, హైదరాబాద్‌కు చెందిన మహ్మద్ ఉమర్ -- హాజిరా బేగం సహకారంతో మజీద్ వద్ద బోరు వేయించి ట్యాంకు నిర్మాణం చేపట్టింది. షేక్ హైదర్ -- హలీమా బేగం జ్ఞాపకార్థంగా ఈ పనులు నిర్వహించారు. గురువారం ముస్లిం మత పెద్దల సమక్షంలో రిబ్బన్ కట్ చేసి బోరు, ట్యాంకును ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మహ్మద్ ఉమర్ -- హాజిరా బేగం దంపతులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముస్లిం పెద్దలు కరీం, నన్నె సాహెబ్, మండల నాయకులు ఉంగరాల సైదా, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు రాకేష్, జిల్లా నాయకులు అరుణ్, మాజీ ఎంపిటిసి సలోమాన్, యెహోన్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న రీ సర్వేతో భూములకు శాశ్వత పరిష్కారం .. తహసీల్దార్ శ్రీనివాసరావు



**నూతనకల్... మార్చి 05 (ప్రజా జ్యోతి):**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న రీ సర్వేతో భూములకు శాశ్వత పరిష్కారం చేకూరుతుందని తహసిల్దార్ శ్రీనివాసరావు అన్నారు గురువారం తాసిల్దార్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ రి సర్వేతో గ్రామాలలో ఉన్న అన్ని భూములకు సర్వే చేసి ఖచ్చితమైన హద్దులు నిర్ణయించవచ్చని తెలిపారు సర్వే చేసిన రైతులకు భారతి చట్టం ప్రకారం భూ ఆధార్ కార్డులు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు మండలంలో రి సర్వే చేయుటకు నూతనకల్. గుండ్ల సింగారం . పెద్దనేమిలా ఎర్ర పహాడ్ ఎడవెల్లి దిర్శన పల్లి చిల్పకుంట్ల మిర్యాల మాచినపల్లి గ్రామాలను మొదటి విడతగా ఎంపిక చేసినట్లు వారు తెలిపారు కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కరెంటు కోతలు ఎత్తివేయాలి

## సబ్ స్టేషన్ ముందు రైతుల ధర్నా

**సంస్థాన్ నారాయణపురం,**

మార్చి 05, (ప్రజాజ్యోతి) : రైతులకు సరఫరా చేస్తున్న కరెంటును కోతలను తగ్గించాలని కొర్ర తండా సర్పంచ్ కొత్త శంకర్ నాయ క్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంస్థాన్ నారాయణపురం మండలం లచ్చమ్మ గూడెం గ్రామం విద్యుత్ సబ్‌స్టేషన్ ముందు కొర్ర తండాకు చెందిన రైతులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా కుర్ర శంకర్ నాయక్ మాట్లాడుతూ ప్రభుత్వం నిరంతరం విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలన్నారు. కరెంటు పోతల వలన వరి పంటలు




ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ దశరథ, మాజీ సర్పంచ్ లచ్చిరాం నాయక్, లాలూ నాయక్, గోవర్ధన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# గుజ్జ లో రేణుక ఎల్లమ్మ దేవాలయ నిర్మాణానికి శంకుస్థాపన

**సంస్థాన్ నారాయణపురం,**

మార్చి 05, (ప్రజాజ్యోతి) : సంస్థాన్ నారాయణపురం మండలం గుజ్జ గ్రామంలో గురువారం రేణుక ఎల్లమ్మ దేవాలయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. దేవాలయ నిర్మాణానికి రెండు లక్షల రూపాయల విరాళాలను అందజేసిన బోద్దుల వెంకటేశ్వర్లు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఎర్ర కవితా సైదులు, పంచాయతీ కార్యదర్శి వంటపాక లింగస్వామి, ఉప సర్పంచ్ వెలిజాల శ్రీను, హనుమయ్య, పగిళ్ల శ్రీకాంత్, చాపల సందీప్, ఎర్ర అనిత మహేష్, ఎర్ర మౌనిక సురేష్ , రాములు, బర్ల రాజు తదితరులు పాల్గొన్నారు.



# సీఎంను సన్మానించిన కాంగ్రెస్ నేత జక్కలి ఐలయ్య యాదవ్



**సంస్థాన్ నారాయణపురం,**

మార్చి 05, (ప్రజాజ్యోతి) : రాజ్యసభ సభ్యుల నామినేషన్ల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు జక్కలి ఐలయ్య యాదవ్ సీఎం రేవంత్ రెడ్డిని సన్మానించారు. రాజ్యసభ సభ్యులుగా నామినేషన్ వేస్తున్న వేం నరేందర్ రెడ్డి, అభిషేక్ మన్ సింగ్వి లకు శుభాకాంక్షలు తెలిపి హర్షం ప్రకటించారు.

# టీఎన్జీఓ భవనంలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు

### గేమ్స్ కార్యక్రమాన్ని ప్రారంభించిన... జిల్లా అధ్యక్షులు నాగిళ్ల మురళి

**నల్గొండ మార్చి 5 (ప్రజా జ్యోతి)**

తెలంగాణ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ నల్లగొండ జిల్లా కమిటీ మహిళ విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం మార్చి 8,2026 సందర్భంగా మూడు రోజుల కార్యక్రమంలో భాగంగా నల్లగొండ పట్టణ కేంద్రంలో టీఎన్జీవో భవన్ నందు గేమ్స్ కార్యక్రమాన్ని జిల్లా అధ్యక్షులు నాగిళ్ల మురళి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో 56 శాఖల మహిళా ఉద్యోగులు పాల్గొని క్యారమ్స్ చెస్ మ్యూజికల్ చైర్స్ ఆటల పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు అని ఆయన తెలిపారు మిగతా 6, 7 తేదీల్లో జరిగే మహిళ ఉద్యోగులకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించబడునని ఆయన పేర్కొన్నారు. అలాగే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నలగొండ జిల్లా కలెక్టర్ బి. చంద్ర శేఖర్, నలగొండ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డ్, జిల్లా మహిళ అధికారులు హాజరు కానున్నారు అని అన్నారు. అదే విదంగా జిల్లా మహిళా ఉద్యోగులందరు కుటుంబ బాధ్యతలను వృత్తి బాధ్యతలను నిబద్ధత నిర్వహిస్తూ సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించే మహిళా ఉద్యోగులు రోజువారి విధి నిర్వహణలో కొంత ఉపశమనం కల్పించే మూడో రోజు శనివారం జరిగే ఈ గేమ్స్ లలో అన్ని శాఖల మహిళ ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని వారు కోరారు.





# ఏదుల రిజర్వాయర్ వద్ద ఈఎంసి ద్వంద నీతి...

### డిండి కాల్వకు 440.. వట్టెం కాల్వకు 436 మీటర్ల ఎత్తు నుంచి నీటి తరలింపా..

### పైగా వట్టెం వైపు 6 కు బదులు 8 మోటార్ల బిగింపు

### వట్టెంకు రోజుకు 2 టీఎంసీలు తరలించే అవకాశం

### దిండికి రోజు కు 6 వేలకు బదులు 1500 క్యూసెక్కులే గతి

### రిటైర్డ్ ఇంజనీర్ ఇంద్రసేనారెడ్డి స్వష్టీకరణ

**సంస్థాన్ నారాయణపురం,**

మార్చి 05, (ప్రజాజ్యోతి) : ఏదుల రిజర్వాయర్ నుంచి 436 మీటర్ల ఎత్తు నుంచి వట్టెం ప్రాజెక్టుకు 8 మోటార్ పంపులతో రోజుకు 2 టీఎంసీల నీటిని తరలించేందుకు నిర్ణయించిన ఈఎంసి దిండి కాలువకు 440 మీటర్ల ఎత్తు పెంచడం వల్ల నీరు సరఫరా కాకుండా ఈఎంసి నిర్ణయించి తమ ద్వంద నీతిని పాటించినట్లు అయిందనీ రిటైర్డ్ నీటిపారుదల శాఖ ఇంజనీర్ ఇంద్రసేనారెడ్డి స్పష్టం చేశారు. గురువారం ఆయన "ప్రజాజ్యోతి" తో మాట్లాడారు. ప్రభుత్వం ఏదుల రిజర్వాయర్ నుంచి ఇటు డిండి కాల్వకు అటు వట్టెం ప్రాజెక్టుకు ఇరువైపులా 436 మీటర్ల ఎత్తులోనే సమాన స్థాయిలో నీటిని తరలించాలని నిర్ణయించి ప్రభుత్వం పనులు చేపట్టిందన్నారు. నార్లాపూర్ నుంచి ఏదుల రిజర్వాయర్ రోజుకు రెండు టీఎంసీల వరద జలాలు 60 రోజులపాటు వస్తాయని అంచనా వేసిందన్నారు. ఏదుల రిజర్వాయర్లో 440 మీటర్ల లెవెల్ వద్ద 4.16 టీఎంసీలు, 436.70 వద్ద 3.04 టీఎంసీల నీరు ఉంటుందన్నారు. ఒకటి ఎం సి నీరు తేడా ఉంటుందని వివరించారు. కానీ రిజర్వాయర్ లోకి రోజువారి వచ్చే 2 టీఎంసీల నీటిని 436 మీటర్ల వద్ద వట్టెం ప్రాజెక్టుకు పంపులు నడుస్తున్నప్పుడు నీటి లెవెల్ పెరగదు అన్నారు. 6 పంపులతోనే ఒకటిన్నర టీఎంసీల నీటిని తీసుకువెళ్లే అవకాశం ఉన్న గాని 8 పంపులను నిర్మాణం చేయడం వలన రోజుకు రెండు టీఎంసీలు తీసుకునే అవకాశాన్ని ఈఎంసి కల్పించినట్లు అయిందన్నారు. దిండి కాల్వకు మాత్రం ప్రభుత్వం నిర్ణయించిన 436.70 మీటర్లకు బదులు 440 మీటర్ల ఎత్తు పెంచడం వల్ల కేవలం అదనంగా ఉన్న 1 టీఎంసీ నీరు పారుదల మాత్రమే జరుగుతుందన్నారు.



రిజర్వాయర్లో 440 మీటర్ల నుంచి 436.70 లెవల్ కు నీరు తగ్గినప్పుడు కేవలం రోజుకు 1500 క్యూసెక్కుల నీరు 56 రోజులు మాత్రమే దిండి కాలువకు సరఫరా జరిగే అవకాశం ఉందన్నారు. 436 మీటర్ల వద్ద నుంచి రోజుకు అర టీఎంసీని తరలించడానికి ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. కానీ నాగర్ కర్నూల్ జిల్లా డిజైనింగ్ ఇంజనీర్లు సిఈ కలిసి ఈఎన్సీని తప్పుదారి పట్టించారని తెలిపారు. రోజుకు 1500 క్యూసెక్కుల చొప్పున ఒకవేళ 56 రోజులు సరఫరా జరిగినా ప్రభుత్వం నిర్ణయించిన 30 టీఎంసీలకు బదులు కేవలం 7 టీఎంసీల నీరు మాత్రమే సరఫరా అయ్యే అవకాశం ఉంటుందన్నారు. ఈఎన్సీ డిజైన్ ఇంజనీర్లు చేసిన తప్పుడు నిర్ణయం వలన వేల కోట్లు ఖర్చుపెట్టి శివన్న గూడెం వరకు నిర్మిస్తున్న ప్రాజెక్టులకు నీరు వచ్చే అవకాశం లేదని ఇంద్రసేనారెడ్డి వివరించారు. ఈ ప్రాజెక్టులన్ని వృధాగా మిగిలిపోయే ప్రమాదం ఉంటుందని, మునుగోడు దేవరకొండ ప్రాంతాల ప్రజలకు తాగు సాగునీరు అందే అవకాశం రాదని ఇంద్రసేనారెడ్డి స్పష్టం చేశారు. నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి స్పందించి ఈఎంసి నిర్ణయాన్ని సవరించాలని కోరారు

# విద్యార్థులు క్రమశిక్షణ,కృషితోనే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చు





### ది న్యూ స్టాండర్డ్ పాఠశాల వార్షికోత్సవ వేడుకలు

### ప్రతిభ చాటిన విద్యార్థులకు మెమొంటోల ప్రదానం

### మురిపించిన చిన్నారుల నృత్యాలు

### ది న్యూ స్టాండర్డ్ పాఠశాల కరెస్పాండెంట్ చంద్రశేఖర రావు

**నాగార్జునసాగర్ మార్చి 5 ప్రజా జ్యోతి**

విద్యార్థులు చదువుతో పాటు క్రమశిక్షణను అలవరుచుకున్నప్పుడే సమాజంలో ఉన్నత స్థానాలకు చేరుకోగలరని ది న్యూ స్టాండర్డ్ పాఠశాల కరెస్పాండెంట్ చంద్రశేఖర రావు అన్నారు,గురువారం నాగార్జునసాగర్ పైలాన్ కాలనీ ది స్టాండర్డ్ స్కూల్ పాఠశాల వార్షికోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా పాఠశాల కరస్పాండెంట్ చంద్రశేఖర రావు నిర్వహించారు,ఈ వేడుకల్లో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు విద్యార్థుల తల్లిదండ్రులను స్థానిక ప్రజలను అలరించాయి,చిన్నారి విద్యార్థులు చేసిన నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.ఈ సందర్భంగా కరస్పాండెంట్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చిన్నతనం నుంచే ఒక గొప్ప లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి ఆ లక్ష్య సాధన కోసం నిరంతరం శ్రమించాలని కోరారు విద్యార్థులు కేవలం పుస్తక జ్ఞానానికే పరిమితం కాకుండా,క్రీడలు,సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనడం వల్ల మానసిక వికాసం కలుగుతుందని తెలిపారు.నేటి ప్రదర్శనల్లో విద్యార్థుల ప్రతిభ చూస్తుంటే గర్వంగా ఉందని అభినందించారు, వార్షికోత్సవం సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు కరెస్పాండెంట్ చంద్రశేఖర రావు చేతుల మీదుగా మెమొంటోలను అందజేశారు.విద్యార్థులు సాధించిన విజయాలను అభినందిస్తూ ,భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుల బృందం పాఠశాల సిబ్బంది విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

